TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక : 99 | ఆదివారం 01-12-2024 | పేజీలు : 5 | వెల :4/-



కాలుష్య నియంత్రణపై విధిగా ఉద్యమించాలి: కొండా సురేఖ

2లో



రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే

2లో



జగన్ అండతోనే పోర్ట్ నుంచి రేషన్ బియ్యం అక్రమ తరలింపు

- మంత్రి నాదెండ్ల

2లో

## సంక్రాంతి తర్వాత రైతు భరోసా

# పైసలు వేస్తాం....



### ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై సీఎం సమీక్ష..
- వచ్చే యాభై ఏళ్ళ అవసరాలకు సరిపడేలా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం ఉండాలి
- ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలి

**హైదరాబాద్:** రైతు భరోసాను కొనసాగిస్తామని ,. సంక్రాంతి తర్వాత రైతు భరోసా పైసలు వారి ఖాతాలలో వేస్తామని తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ ,ఇప్పటికే రైతు భరోసాపై కేబినెట్ సబ్ కమిటీ వేశామని చెప్పారు. అసెంబ్లీలో చర్చించి విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు.. వరికి రూ.500 బోనస్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతోనే భోజనం వడ్డించేలా ఆదేశాలు ఇచ్చామని అన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణను అప్పులమయంగా చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఏడాది కాలంలోనే 20వేల కోట్ల రుణమాఫీ చేశామని.. ఇది దేశంలోనే ఒక రికార్డు అని చెప్పారు. అసెంబ్లీలో విధి విధానాల పై చర్చించి సంక్రాంతి తర్వాత రైతు భరోసా ఇస్తామన్నారు. సన్నాలకు రూ. 500బోనస్ కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ రూపంలో వచ్చే మారీచులను రైతులు నమ్మొద్దని అన్నారు. బీపీటీ, హెచ్ఎంటీ, తెలంగాణ సోనా వేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వం రైతుల కోసం పని చేస్తుందన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గుజరాత్ గులామని విమర్శించారు. ఆయనకు తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన హామీలపై చర్చిద్దాం రావాలని సీఎం సవాల్ విసిరారు. రాష్ట్రంపై రూ. 7లక్షల కోట్లు అప్పు చేశారని ధ్వజమెత్తారు. ప్రతినెలా రూ. 6500 కోట్లు వడ్డీకే కట్టాల్సి వస్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలాదిగజారిందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పుల గురించి గతంలో ఎవరూ బయటపెట్టలేదని చెప్పారు.ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ప్రతిపక్షాల మాటలను

మిగతా 2లో

## మరో భారీ ఎన్‌కౌంటర్..

- ఏడుగురు మావోయిస్టులు మృతి



**ములుగు :** అడవిలో అలజడి... దండకారణ్యం ఒక్కసారిగా దద్దరిల్లుతోంది.. తుపాకుల మోతలతో రక్తమోడుతోంది. పచ్చని అటవీప్రాంతం ఎరుపెక్కుతోంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం వరుస ఎన్‌కౌంటర్లతో రక్తసిక్తమయిన విషయం తెలిసిందే.. తాజాగా.. తెలంగాణలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. దండకారణ్యం ఒక్కసారిగా దద్దరిల్లుతోంది.. తుపాకుల మోతలతో రక్తమోడుతోంది. పచ్చని అటవీప్రాంతం ఎరుపెక్కుతోంది. ఇటీవల ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతం వరుస ఎన్‌కౌంటర్లతో రక్తసిక్తమయిన విషయం తెలిసిందే.. తాజాగా.. తెలంగాణలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ములుగు జిల్లాలోని చల్పాక సమీప అడవుల్లో మావోయిస్టు -గ్రేహౌంబ్స్ బలగాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి.. ఈ భారీ ఎన్ కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్‌కౌంటర్‌లో

మిగతా 2లో



## మన దేశ స్ఫూర్తి కోసమే

# మా పోరాటం

- ప్రజల హక్కుల దుర్బలం చేసి 'వాణిజ్యవేత్త మిత్రుల' పరం చేస్తున్నారు
- బిజెపి, కేంద్రంపై ప్రియాంక గాంధీ విమర్శనాస్త్రాలు

**వయనాడ్ :** కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా ఆదివారం బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రజల హక్కులను దుర్బలం చేసి, కొద్ది మంది 'వాణిజ్యవేత్తలైన మిత్రుల' పరం చేస్తున్న శక్తిపై పోరాటం చేస్తున్నామని ఆమె తెలిపారు. వయనాడ్‌లోని మనంతవాడిలో ఒక సమావేశంలో ప్రియాంక ప్రసంగిస్తూ, 'మన దేశ నిర్మాణానికి పునాదులైన వ్యవస్థలను నాశనం చేసేందుకు తన అధికారం కింద సర్వం చేస్తున్న ఒక శక్తిపై మేము పోరాటం సాగిస్తున్నాం' అని చెప్పారు. 'మన దేశం స్ఫూర్తి కోసం, భారత్ ఆత్మ కోసం మేము పోరాడుతున్నాం' అని ఆమె చెప్పారు. ప్రజలకు నిజాయతీగా చెందవలసిన ఈ దేశ అధికారం, వనరుల కోసమే పోరు అని కూడా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక పేర్కొన్నారు.జూలై 30న పర్వత జిల్లా వయనాడ్‌ను

మిగతా 2లో

## ప్రతి ఎకరానికి సాగు నీరందిస్తాం..

# పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

### సన్నాలకు బోనస్‌తో రైతుల్లో ఆనందంలి మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ప్రతి ఎకరానికి సాగునీరు అందే విధంగా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఆదివారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లతో కలిసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పౌరసరఫరాల శాఖ విభాగం పై ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్ లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు..గౌరవెల్లి ప్రాజెక్టు కాల్వ పనులు, కాళేశ్వరం ప్యాకేజ్ 9 పెండింగ్, చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకం, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం, రామగుండం ఎత్తిపోతల పథకం, ఎల్లంపల్లి కెనాల్ నెట్ వర్క్ ప్యాకేజ్ 2 పనులు, ధాన్యం సేకరణ, కస్టం మిల్లింగ్ రైస్ డెలివరీ తదితర అంశాల పై మంత్రి ఉత్తమ్ సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు పండించారన్నారు. గతంలో ఎక్కడా లేని విధంగా సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ చెల్లిస్తుందన్నారు. రైతులకు ఎక్కడా తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రైతులకు రికార్డు సమయంలో వడ్ల డబ్బులు పడ్తున్నాయన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ సంతృప్తి కరంగా ఉందన్నారు.డిసెంబర్ 4న సీఎం పర్యటన ఉన్న సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేస్తే గంటల వ్యవధిలో రైతులకు మద్దతు ధర, బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సమయానికి 100 శాతం ధాన్యం డబ్బులు

మిగతా 2లో

## ఇక దేశ ఆర్థిక అభివృద్ధి ఉండబోదు: రాహుల్ గాంధీ



భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయి 5.4 శాతానికి చేరుకుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం అన్నారు. రైతులు, కార్మికులు, మధ్యతరగతి, పేదలు ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటుంటే, ప్రయోజనాలు కొంతమంది బిలియనీర్లకే పరిమితమైతే భారత ఆర్థిక వ్యవస్థ పురోగమించబోదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.“ భారతదేశం స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయికి, అంటే 5.4%కి పడిపోయింది. విషయమేమిటంటే – భారత ఆర్థిక వ్యవస్థ కేవలం కొద్దిమంది బిలియనీర్లకు మాత్రమే ప్రయోజనాలు అందుతున్నంత కాలం .. రైతులు, కార్మికులు, మధ్యతరగతి మరియు పేదలు వివిధ ఆర్థిక సమస్యలతో పోరాడుతున్నంత కాలం భారత ఆర్థిక వ్యవస్థ పురోగమించదు” అని కాంగ్రెస్ నాయకుడు 'ఎక్స్' లో (ఇదివరకటి ట్విట్టర్) పోస్ట్ చేశారు.ఙబంగాళదుంపలు, ఉల్లి ధరలు దాదాపు 50 శాతం పెరగడంతో రిటైల్ ద్రవ్యోల్బణం 6.21 శాతానికి

మిగతా 2లో

## ప్రజలను కాపాడాలని అడిగితే నాపై దాడులు చేయిస్తున్నారు

- ఢిల్లీలో శాంతి భద్రతలను గాలికి వదలివేశారు
- కేంద్రంపై కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు
- మొన్న తనపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ అమిత్ షాపై ఆగ్రహం



2

# సంక్రాంతి తర్వాత రైతు భరోసా పైసలు వేస్తాం

నమ్మొదని అన్నారు. ఇచ్చిన గ్యారెంటీలను అధైర్యపడకుండా అమలు చేస్తామని అన్నారు. రైతులను రాజు చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.2023 వానాకాలంలో రైతు బంధును కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. రైతులు సన్న వడ్లు పండించాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు.తాము అధికారంలోకి రాగానే రూ. రూ. 7625 కోట్లు రైతుబంధు నిధులు ఇచ్చామని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. రైతు భరోసాను కొనసాగిస్తాం..”రైతును రాజును చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. కేసీఆర్ ప్రభుత్వం ఈ విషయాలను ఎప్పుడూ బయటపెట్టలేదు. అధికారంలోకి రాగానే అన్ని అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశాం.

రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. రైతులకు తొలి ప్రాధాన్యం ఇస్తుంది కాంగ్రెస్ ఒక్కటే. నెహ్రూ నుంచి వైఎస్సార్ దాకా రైతులే మా ఎజెండా. కేసీఆర్ బకాయి పెట్టిన రైతుబంధును మేం చెల్లించాం. అధికారంలోకి రాగానే రూ.7,625కోట్ల రైతుబంధు నిధులు చెల్లించాం. ఆగస్టు 15నాటికి 22.22లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశాం. ఆగస్టు 15నాటికి రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లు జమచేశాం. నిన్న 3.14లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ2,747కోట్లు వేశాం. ఇప్పటివరకు 25.35 లక్షలమంది రైతుల ఖాతాల్లో.. రూ.21వేల కోట్లు జమ చేశాం. రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ రైతులను మోసం చేసింది. రైతు భరోసాను కొనసాగిస్తాం. సంక్రాంతి తర్వాత రైతు భరోసా డబ్బులు వేస్తాం.అని చెప్పారు రేవంత్. దీనిపై విధివిధానాల ఖరారుకు కేబినెట్ సబ్‌కమిటీ వేశామన్న రేవంత్.. కార్యాచరణపై అసెంబ్లీలో చర్చిస్తామన్నారు. ఎవరు అడ్డుపడినా రైతు భరోసా అందిస్తామని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్, బీజేపీ నేతల మాటలు రైతులు నమ్మొద్దని కోరారు.రూ. 16 వేల కోట్ల మిగులుతో తెలంగాణను కేసీఆర్‌కు అందిస్తే, పదేళ్ల తర్వాత రూ.7 లక్షల అప్పులతో రాష్ట్రాన్ని తమకు అప్పగించారన్నారు రేవంత్. ఇండిపెండెన్స్ వచ్చిన తర్వాత ఇన్నేళ్ల కాలంలో ఏ సర్కార్ ఇంత తక్కువ కాలంలో రుణమాఫీ చేయలేదన్న ముఖ్యమంత్రి.. 2018 నుంచి 2023 వరకు ఐదేళ్లలో తీసుకున్న లోన్స్ అన్నీ ఏకకాలంలో తీర్చినట్లు వివరించారు.

తెలంగాణకు భారీగా అప్పులు ఉన్నప్పటికీ రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇప్పటి వరకు 25లక్షల 35వేల మంది రైతులకు 21,000 కోట్ల రుణాలు మాఫీ చేశామని వెల్లడించారు. రేషన్‌కార్డు లేని వారికి కూడా రుణమాఫీ చేశామన్నారు. మాజీ ప్రధాని నెహ్రూ నుంచి.. ఇప్పటివరకు రైతులకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని సీఎం తెలిపారు. అలానే రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తామని సీఎం ప్రకటించారు. కొత్త సంవత్సరంలో.. సంక్రాంతి పండగ తర్వాత రేషన్ కార్డులు ఉన్న వాళ్లందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. వచ్చే యాభై ఏళ్ళ అవసరాలకు సరిపడేలా ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం ఉండాలని.. నాణ్యత విషయంలో ఎక్కడా లోపం లేకుండా చూడాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఉస్మానియా ఆస్పత్రిని భావితరాలకు అత్యంత మెరుగైన వైద్య సేవలు అందించేలా తీర్చి దిద్దాలని స్పష్టం చేశారు.ఆదివారం హైదరాబాద్‌లో ఉస్మానియా ఆసుపత్రి పనులకు సంబంధించిన అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రహదారులపై ఆయన పలు కీలక సూచనలు చేశారు.ఆసుపత్రికి కావాల్సిన మౌలిక సదుపాయాలు.. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర పనుల కోసం సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అందుకోసం అన్ని శాఖలతో సమన్వయం కోసం నోడల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి దాన కిషోర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిని గోషా మహల్ స్టేడియంకు తరలించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గతంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని తాజాగా నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన అధికారులకు సూచించారు.రాబోయే 50 ఏళ్ల అవసరాలను బేరీజు వేసుకుని కొత్త ఆసుపత్రికి రూపకల్పన చేయాలన్నారు. ఆసుపత్రికి నాలుగు వైపులా రహదారులు ఉండేలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ చిక్కులు లేకుండా కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని తెలిపారు.

ఈ మేరకు రహదారుల విస్తరణకు వెంటనే సర్వే పనులను ప్రారంభించాలని సీఎంగారు ఆదేశించారు. కాగా, గోషామహాల్‌లో దాదాపు 32 ఎకరాల్లో పోలీస్ స్టేడియం, పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కొత్త ఆసుపత్రిని నిర్మించాలని.. అందుకు సంబంధించిన స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు బదిలి చేయాలని అధికారులకు గతంలో సీఎం ఆదేశించారు. ఇక పోలీస్ స్టేడియం వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించడంతో.. ప్రత్యామ్నాయ స్థలాన్ని పోలీస్ శాఖకు కేటాయించాలని సీఎం ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌తోపాటు– పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కాలుష్య నియంత్రణపై విధిగా ఉద్యమించాలి: కొండా సురేఖ

**హైదరాబాద్:** జీవమున్న ఏకైక గ్రహమైన భూమిని భవిష్యత్ తరాల మనుగడుకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. మానవులకు ప్రాణాధారమైన గాలి, నీరు, నేల రోజు రోజుకీ విషతుల్యమై, ప్రాణాలను హరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణ దిశగా ప్రభుత్వానికి సహకరిస్తూ, విధిగా ఉద్యమించాల్సిన అత్యయిక పరిస్థితి నెలకొన్నదని మంత్రి సురేఖ తెలిపారు. డిసెంబర్ 2 జాతీయ కాలుష్య నియంత్రణ దినం సందర్భంగా మంత్రి కొండా సురేఖ కాలుష్య నియంత్రణపై తన భావాలను పంచుకున్నారు.

భారతదేశంలో 1984 డిసెంబర్ 2న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో యూనియన్ క్బాడ్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదం దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఘోరమైన పారిశ్రామిక విపత్తుగా నిలిచిందని మంత్రి అన్నారు. ఈ దుర్ఘటనలో విడుదలైన ప్రమాదకరమైన మిథైల్ ఐసోసైనేట్ అనే విష రసాయనంతో కూడిన గాలిని పీల్చి వేల మంది మరణించగా, దాదాపు ఆరు లక్షల మంది ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవడం నాడు దేశాన్ని కంపింపచేసిందని మంత్రి గుర్తు చేసుకున్నారు. ఈ ఘోర దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ ప్రతీ ఏడాది డిసెంబర్ 2న జాతీయ కాలుష్య నియంత్రణ దినాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో పరిశ్రమల కాలుష్యాన్ని నివారించడంతో పాటు కాలుష్యానికి వ్యతిరేకంగా పోరాడేలా ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏటా ఈ రోజున జాతీయ కాలుష్య నియంత్రణ దినాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ యేడు స్వచ్ఛమైన గాలి, పచ్చని భూమి – సుస్థిరమైన జీవనం వైపు అడుగు అనే నేపథ్యంతో ప్రజలకు కాలుష్య నియంత్రణ పై అవగాహన కల్పిచే దిశగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కాలుష్య నియంత్రణ దినాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పెరుగుతున్న వాయు కాలుష్యంపై అవగాహన కల్పించడం, పారిశ్రామిక విపత్తులను నిర్వహణ, నియంత్రణ పై కార్యక్రమాలు చేపట్టడం, మానవ నిర్లక్ష్యం వల్ల రోజురోజుకీ పెరుగుతున్న కాలుష్యంతో సంభవిస్తున్న దుష్పరిణామాలు, కాలుష్య నియంత్రణకై ఆచరించాల్సిన కార్యాచరణను ప్రచార చేయడం, పారిశ్రామిక కాలుష్యాన్ని నివారించే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి సురేఖ వివరించారు.

ప్రతి ఏటా మన దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ కాలుష్యం కారణంగా సంభవిస్తున్న లక్షలాది మరణాలు కాలుష్య తీవ్రత ఏ స్థాయిలో పెరుగుతూ పోతుందో తెలియజేస్తున్నదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కాలుష్య నియంత్రణ దినం స్ఫూర్తితో ప్రతి ఒక్కరు పర్యావరణ అనుకూల వస్తువులను వాడటంతో పాటు, మొక్కలను నాటుతూ, పచ్చదనాన్ని పెంచుతూ పర్యావరణ పరిరక్షణకు తమవంతు సహకారం అందించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాచరణకు తోడుగా ప్రజలు ఉద్యమిస్తేనే ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే

- రైతు రుణమాఫీ, సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయం
- మహబూబ్ నగర్‌లో రైతు పండగ విజయవంతం - మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

**హైదరాబాద్:** దేశంలో ఏక కాకంలో రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రజా ప్రభుత్వానికే దక్కుతుందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహబూబ్ నగర్‌లో రైతు పండగ, సిఎం బహిరంగ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతు అవగాహన సదస్సు, రైతు పండగ, బహిరంగ సభను విజయవంతం చేసిన రాష్ట్ర, ఉమ్మడి జిల్లా అధికార యంత్రాగానికి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు.రైతు రుణమాఫీ, సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయిస్తానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బూర్గుల రామకృష్ణారావు తర్వాత 70 ఏళ్లకు పాలమూరు జిల్లాకు చెందిన రేవండ్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని కొనియాడారు. ఈ ప్రాంత వాసిగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే తపన రేవంత్ రెడ్డికి ఉందని పేర్కొన్నారు. ఒకప్పటి వలసల జిల్లాను విద్యా, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయ, సాగునీటి రంగాల్లో అగ్రగ్రామిగా నిలిపాలని సిఎం కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. నీటి పారుదల ప్రాజెక్ట్‌లకు సిఎం అవసరమైన నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. రైతు పండగ విజయవంతం కావడంతో బీఆర్ఎస్ నాయకులకు నిద్రపట్టడం లేదని అన్నారు. కాంగ్రెస్ మెదలు పెట్టిన జిల్లా సాగునీటి ప్రాజెక్టులను గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని అన్నారు. పాలమూరు రైతన్నల సాగునీటి కష్టాలకు బీఆర్ఎస్ తీర్చలేకపోయిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు లక్షల కోట్లు వెచ్చించి, జూరాల, భీమా ప్రాజెక్ట్‌లకు నిధులు కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది గత ప్రభుత్వమేనని ఆరోపించారు. కుర్చీ వేసుకుని ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తానన్న కేసీఆర్ పాలమూర్ కు చుక్క నీరివ్వలేదని విమర్శించారు.వరి వేస్తే ఉరి అని గతంలో కేసీఆర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దొడ్డు బియ్యం పేరుతో దళారీలు, మిల్లర్లకు లబ్ధిచేకూర్చారని తెలిపారు. సన్నాలకు రూ.500 బోనస్ తో రైతులు, కౌలు రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు రాష్ట్రాన్ని నిలువునా దోచుకుని, కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం వల్ల ధనిక రాష్ట్రం అప్పుల ఊబిల్లో కూరుకుపోయిందని తెలిపారు. తిమ్మిన బమ్మిని చేద్దామనే బీఆర్ఎస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు.

# మరో భారీ ఎన్‌కౌంటర్..

లమావోయిస్ట్ పార్టీ కీలక నేత బద్రు ఎన్కౌంటర్‌లో మృతి చెందినట్లు పేర్కొంటున్నారు. ఆయనతోపాటు మృతుల్లో మరికొందరు కీలక నేతలు ఉన్నట్లు తెలుస్తోంది..సరిగ్గా వారం రోజుల క్రితం ఇద్దరు ఆదివాసీలను ఇన్ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేశారు. వారం తిరగకముందే.. ఏడుగురు మావోయిస్టులను ఎన్కౌంటర్ లో చనిపోయారు.. ఆదివాసీల హత్య అనంతరం అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ బలగాలు భారీ కూంబింగ్ నిర్వహించారు.. ఈ క్రమంలోనే.. చల్పాక సమీప అడవుల్లో పోలీసు జవాన్లకు.. మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. పోలీసులపైకి కాల్పులు జరపడంతో.. గ్రేహౌండ్స్ బలగాలు తిరిగి కాల్పులు జరిపారు. ఘటనాస్థలంలో రెండు AK-47 రైఫిల్స్ స్వాధీనం చేసుకున్నారు.. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇల్లందు-నర్సంపేట ఏరియా కమిటీ హతమైనట్లు తెలిపారు.

డిసెంబర్ 2 (రేపటి నుండి) నుంచి 8వ తేదీ వరకు మావోయిస్టు పార్టీ పి.ఎల్.జి.ఏ వారోత్సవాలు నేపథ్యంలో మావోయిస్టులు కీలక భేటీ నిర్వహించారు.. అయితే. ఈ భేటీపై పక్కా సమాచారంతో పోలీసులు చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. 14 సంవత్సరాల తర్వాత వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలో అతి పెద్ద ఎన్కౌంటర్ జరిగినట్లు అధికారులు తెలిపారు.

**చనిపోయినవారి వివరాలు ..**

1. కుర్సం మంగు (35) అలియాస్ భద్రు, అలియాస్ పాపన్న, ఇల్లందు నర్సంపేట ఏరియా కమిటీ సెక్రటరీ గా పనిచేస్తున్నాడు.
2. ఎగోలపు మల్లయ్య(43) అలియాస్ మధు, అలియాస్ కమలాకర్, ఏటూరు నాగారం మహదేవ్‌పూర్ కమిటీ సెక్రటరీగా ఉన్నాడు.
3. ముస్సకి దేవల్ (21) అలియాస్ కరుణాకర్, ఇల్లందు నర్సంపేట ఏరియా కమిటీ సభ్యుడిగా..
4. ముస్సకి జమున (21) ఇల్లందు నర్సంపేట ఏరియా కమిటీ సభ్యురాలిగా ఉన్నారు.

వీరితోపాటు.. 5. జైసింగ్, 6. కిషోర్, 7. కమలేష్, మావోయిస్టు పార్టీ మెంబర్లుగా ఉన్నారు.

# జగన్ అండతోనే పోర్ట్ నుంచి రేషన్ బియ్యం అక్రమ తరలింపు

**విజయవాడ:** రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ఎంత పెద్ద వారు ఉన్నా వదిలే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు మంత్రి నాదెండ్ల మనోహర్. కాకినాడ పోర్ట్ వద్ద డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనలో ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయని, దేశ భద్రతకు భంగం కలిగించేలా అక్కడ స్మగ్లింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

విజయవాడలో నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. , కూటమి ప్రభుత్వంలో మంత్రిగా తాను తెనాలి నియోజకవర్గంలో పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లో తనిఖీ చేశామని, ఆ తరువాత తనిఖీల్లో కూడా తూకాల్లో తేడాలు ఉన్నాయని చెప్పారు.

ఇక, 51,427 మెట్రిక్ టన్నుల బియ్యం కాకినాడలో తనిఖీల్లో పట్టుకున్నామన్నారు. 13 కంపెనీలపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు. దీంతో వారు కోర్టుకు వెళ్లి బియ్యం విడుదలకు ఆదేశాలు తెచ్చారని.. వారి నుంచి కిలోకి 43.50 చొప్పున ధర కట్టి బియ్యం వెనక్కి ఇచ్చామని మంత్రి తెలిపారు.కాకినాడలో అసలు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొందని.. గత ఐదేళ్లల్లో కాకినాడ పోర్టులోకి ఒక్కరూ కూడా వెళ్లలేదని నాదెండ్ల అన్నారు. జగన్ సిఎంగా ఉన్నప్పుడు డోర్ డెలివరీ పేరుతో 969 వాహనాలు కొని, రూ.16 వేల కోట్లు వృధా చేశారని మంత్రి ఆరోపించారు. గతంలో రేషన్ షాపుల ద్వారా పంపిణీ పదిహేను రోజులు సాగేదని, ఈ వ్యాన్ల ద్వారా జిల్లాల వారీగా ఒక నెట్ వర్కు ఏర్పాటు చేశారని, కిలో పది రూపాయల చొప్పున ప్రజల నుంచి రేషన్ బియ్యం కొని స్మగ్లింగ్‌కు పంపుతున్నారని అన్నారు.కాకినాడ పోర్ట్ నుంచి బియ్యం ఎగుమతి బాగా జరిగిందని.. అరవిందో నుంచి పోర్ట్ లాక్కుని మరీ బియ్యం ఎగుమతి చేశారని.. 23,51,218 కృష్ణపట్నం, 38,2000 మెట్రిక్ టన్నులు విశాఖ నుంచి పంపారని.. కాకినాడ పోర్ట్ నుంచి కోటి 30,18, 400 మెట్రిక్ టన్నుల బియ్యం.. అంటే సుమారు 48,537 కోట్ల రూపాయల విలువ చేసే బియ్యం ఎగుమతి చేశారని మంత్రి అన్నారు.దీని వెనుక ఎవరున్నారో బయటకు లాగుతున్నామని చెప్పారు.గత ప్రభుత్వంలో ఇంత అవినీతి జరిగితే జగన్‌కు తెలియకుండా ఉంటుందా.. అని మంత్రి మనోహర్ ప్రశ్నించారు. కార్పొరేట్ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కెవి రావు కుటుంబాన్ని బెదిరించి 41శాతం వాటా రాయించుకున్నారని, పోర్ట్‌ను పూర్తి గా లాక్కుని ఈ విధంగా దందా చేయడానికి దేశ భద్రతను కూడా పక్కన పెట్టారని విమర్శించారు. భద్రత లేని పోర్ట్‌లో గంజాయి, మారణాయిధాలు రావని ఎలా చెబుతారని మంత్రి ప్రశ్నించారు. పవన్ ఇవే అంశాలను ప్రస్తావిస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు ఎందుకు భుజాలు తడుముకుంటున్నారన్నారు.

గతంలో బియ్యం అక్రమాలు జరిగినా ఈ స్థాయిలో ఎప్పుడూ లేదని, గత ముడేళ్లల్లో కోటీ 31 లక్షల టన్నుల బియ్యం ఎగుమతి చేశారన్నారు. కరోనా సమయంలో 6,300 కోట్ల రూపాయల బియ్యం తరలించారని, వ్యవస్థలను వారి గుప్పెటలో పెట్టుకుని అధికారులను వాడుకున్నారని ఆరోపించారు.

అరబిందోకి అసలైనా బాస్ ఎవరో ఇప్పుడు తెలుస్తుందని, దీనిపై కన్నబాబు, ద్వారంపూడి అప్పుడు ఎందుకు మాట్లాడడంలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు. ఇన్ని కోట్ల అవినీతి జరిగితే గత పాలకులకు తెలియదంటే నమ్మాలా.. నిజంగా తెలియలేదంటే%ా% అది గత ఐదేళ్లుగా ప్రభుత్వం అసమర్థత కాదా.. అని నిలదీశారు. రేషన్ బియ్యం మాఫీయా జగన్ హయాంలో రెచ్చిపోయిందని, జగన్ పోర్ట్‌ను తన ఆధీనంలోకి ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. బెదిరించి, భయపెట్టి అరబిందో కు పార్టనర్ షిప్ కట్టపెట్టారని అన్నారు.ఈ అక్రమ రవాణా అరికట్టేందుకు తమ వంతుగా ఇందుకోసం చాలా కృషి చేస్తున్నామని చెప్పారు

సముద్రం లోకిపవన్ కళ్యాణ్ అంత లోపలకి వెళ్లారంటే అది ప్రజల కోసమేనని అన్నారు. పేదల బియ్యం కాపాడాలనే తపనతో తాము పని చేస్తున్నామని, వ్యవస్థలను మార్చడానికి తాము కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామని, దళారుల వ్యవస్థను కూడా పూర్తి గా అరికట్టాలని అన్నారు. ఈ ప్రక్షాళనలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ సహకారం అందిస్తున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు

# మన దేశ స్ఫూర్తి కోసమే మా పోరాటం

దెబ్బ తీసిన భారీ మట్టిచరియ దుర్ఘటన గురించి ప్రియాంక గుర్తు చేస్తూ, తాను ఎన్నో దుర్ఘటనలు చూసినట్లు తెలియజేశారు. ‘దేశంలో దుర్ఘటనలు సంభవించిన ప్రదేశాలకు మా వృత్తి కారణంగా మేము వెళ్లి జనాన్ని కలుస్తుంటాం. అయితే, నేను ఇక్కడికి వచ్చినప్పుడు చూసిన బాధ గానీ, ఇక్కట్లు గానీ ఎన్నడూ చూడలేదు. ప్రకృతి విలయం ఒక చిన్న ప్రాంతంపై కేంద్రీకృతమైంది. ఆ ప్రాంతంలో ఇళ్లు అన్నీ కొట్టుకుపోయాయి. అన్ని కుటుంబాలూ కొట్టుకుపోయాయి. అందరి జీవనోపాధులూ నీళ్ల పాలయ్యాయి. అయినా, ఈ బీభత్సం మధ్య, ఈ బాధ, ఇక్కట్ల మధ్య మీలో మానవత్వాన్ని నా కళ్లతో చూశాను. మీరు మతం అడగలేదు, కులం అడగలేదు, బాధితుల సహాయార్థం మీరు చేయగలిగింది అంతా చేశారు. అది సిసలైన విలువలకు ప్రతీక’ అని ప్రియాంక అన్నారు. లోక్‌సభకు ఎన్నికైన అనంతం మొదటిసారిగా ఈ పర్వత జిల్లాకు వచ్చిన ప్రియాంక తన మొదటి బాధ్యత మలయాళం నేర్చుకోవడమేనని చెప్పారు. మీరు ఇక్కడే ఉంటారా అన్న సభికుల ప్రశ్నలకు ప్రియాంక సమాధానం ఇస్తూ, ‘ఆ విషయం కచ్చితంగా చూస్తా’ అని చెప్పారు. ఇక్కడ ఉండేందుకు చక్కని ప్రదేశం కోసం చూస్తానని ప్రియాంక తెలిపారు.

# ప్రతి ఎకరానికి సాగు నీరందిస్తాం.. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

చెల్లించి ఉండాలని ఆదేశించారు. సన్న రకం ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా అధికంగా కొనుగోలు చేయాలని, ప్రైవేట్ వ్యాపారులు ఎక్కడ 2800 కంటే తక్కువ ధరతో సన్న రకం ధాన్యం కొనుగోలు చేయకుండా చూడాలన్నారు. రాబోయే సంవత్సరంలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగా కనీసం 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర గడిచిన నేపథ్యంలో డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, తమ ప్రభుత్వం 10 నెలల కాలంలో 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ ప్రైవేట్ సంస్థలో యువత ఉపాధి పొందేలా అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు.సీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పత్తిపాక రిజర్వాయర్ 2950 కోట్లతో 5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించేందుకు ప్రాథమిక అంచనాలు తయారు చేశామన్నారు. రామగుండం ఎత్తిపోతల పథకం 95 శాతం పూర్తయిందని, డిసెంబర్ నెలాఖరు వరకు పెండింగ్ పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నుంచి రైతులకు సాగు నీరు అందించాలని, పాలకుర్తి ఎత్తిపోతల పథకం ప్రతిపాదనలు, నీటి కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు లోని ప్యాకేజ్ 9 పెండింగ్ పనులు, చిన్న కాళేశ్వరం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.సన్న వడ్లకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ అందించడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.అధికంగా లాభం చేకూరుతుందని, రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రాధాన్యతను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, 2 లక్షల రుణమాఫీ, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ పథకాల లబ్ధి పొందుతున్న రైతులతో వీడియోలు చేసి ప్రచారం చేయాలని , గ్రామాలలో లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలన్నారు. చిన్న కాళేశ్వరం ముక్తేశ్వర ఎత్తిపోతల పథకం గత 10 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలన్నారు. దేవాదుల ప్రాజెక్టుగా సంబంధించి మరిన్ని అవుట్ లెట్ నిర్మాణం చేయాలన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మించడం వల్ల 2.4 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు కొత్తగా మరో 15 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు. పోతారం ఎత్తిపోతలకు పథకం, భీం ఘనపూర్ ఎత్తిపోతల పథకం పనుల ప్రతిపాదనలు అందజేయాలన్నారు.

**నాణ్యమైన భోజనం అందేల చూడాలిలిలిమంత్రి పొన్నం ప్రభాకర్**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న గురుకుల పాఠశాలలో కలెక్టర్ల తో పాటు ఉన్నతాధికారులు సందర్శించి నాణ్యమైన భోజనం అందేలా చూడాలి. మెస్ చార్జీలను గ్రీన్ ఛానల్ ద్వారా అందిస్తున్నామన్నారు. ధాన్యం సేకరణ సజావుగా జరుగుతుందని, రైస్ మిల్లర్లు కూడా ప్రభుత్వ పాలసీ అనుసరిస్తూ సహకారం అందిస్తున్నారన్నారు. గౌరవెల్లి గండేపల్లి ప్రాజెక్టులను లింక్ చేసి సమాంతరంగా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి బండ్ నిర్మాణం చివరి దశలో ఉందని, కాలువల పనులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని, భూ సేకరణ పై ఎటువంటి కోర్టు నిబంధనల లేనందున ముందుగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కవ్వంపల్లి సత్య నారాయణ, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పామెలా సత్పతి, సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, జగిత్యాల జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ తోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇక దేశ ఆర్థిక అభివృద్ధి ఉండబోదు: రాహుల్ గాంధీ

పెరిగిందని, రూపాయి విలువ 84.50కి పడిపోయిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

“ఈ వాస్తవాలను పరిశీలించండి, పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో గమనించండి: రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 6.21 శాతంకి పెరిగింది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది బంగాళదుంపలు, ఉల్లిపాయల ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. రూపాయి కనిష్ట స్థాయి 84.50కి చేరుకుంది. నిరుద్యోగం ఇప్పటికే 45 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టింది’ అని రాహుల్ అన్నారు. గత ఐదేళ్లలో కూలీలు, ఉద్యోగులు, చిన్న వ్యాపారుల ఆదాయం స్తంభించిపోయింది లేదా గణనీయంగా తగ్గిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. “మొత్తం అమ్మకాలలో అందుబాటు ధరల గృహాల వాటా గత ఏడాది 38 శాతం నుండి 22 శాతానికి పడిపోయింది. ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తులకు ఇప్పటికే డిమాండ్ తగ్గుతోంది. గత 10 ఏళ్లలో కార్పొరేట్ పన్ను వాటా 7 శాతం తగ్గగా, ఆదాయపు పన్ను 11 శాతం పెరిగింది. నోట్ల రద్దు, జీఎస్టీ కారణంగా ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగ వాటా 50 ఏళ్లలో కనిష్ఠంగా 13 శాతానికి పడిపోయింది. ఇటువంటి పరిస్థితిలో, కొత్త ఉద్యోగ అవకాశాలు ఎలా సృష్టించబడతాయి? ”అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

# ప్రజలను కాపాడాలని అడిగితే నాపై దాడులు చేయిస్తున్నారు

న్యూఢిల్లీ : ఢిల్లీలో శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రజలను కాపాడాలని అడిగినందుకు కేంద్ర ప్రభుత్వం తనను లక్ష్యంగా చేసుకుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ ఆదివారం సంచలన ఆరోపణలు చేశారు. శాంతి భద్రతల విషయంలో ఢిల్లీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళితే పరిష్కారం చూపిస్తుందని తాను భావించినట్లు కేజ్రీవాల్ విలేకరుల గోష్ఠిలో చెప్పారు. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా స్పందించి చర్యలు తీసుకుంటారని భావించానని, కానీ తననే లక్ష్యంగా చేసుకున్నారని, ఇలా దాడులు చేయిస్తారని తాను అనుకోలేదని కేజ్రీ చెప్పారు. శనివారం సాయంత్రం మాలవీయ నగర్‌లో పాదయాత్ర చేసిన కేజ్రీవాల్‌పై ఒక వ్యక్తి దాడికి యత్నించిన విషయం విదితమే.

అతను తన చేతిలోని ఒక ద్రావకాన్ని కేజ్రీవాల్‌పైకి విసిరాడు. దీనితో అప్రమత్తమైన భద్రత సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తిని ప్రస్తుతం పోలీసులు విచారిస్తున్నారు. కేజ్రీవాల్ తాజాగా ఆ ఘటనను ప్రస్తావిస్తూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఆ ద్రావకం హానికారకం కాదని, కానీ, అది ప్రమాదభరితం అయి ఉండేదని ఆయన అన్నారు. అది గత 35 రోజుల్లో తనపై మూడవ దాడి అని కేజ్రీ చెప్పారు. కాగా, వచ్చే ఏడాది జరగనున్న ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో గాని, కూటమిలోని ఇతర పార్టీలతో గాని కలసి ఆప్ పోటీ చేసే అవకాశం ఉందా అని మీడియా ప్రశ్నించగా, అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఎవరితోను పొత్తు పెట్టుకోదని, ఆ దిశగా తాము ఇంత వరకు ఎటువంటి ప్రయత్నమూ చేయలేదని ఆయన సమాధానం ఇచ్చారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తుందని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

**కేజ్రీవాల్‌కు మాత్రమే ఇలా జరుగుతోందేమిటి?: బిజెపి నేత సెటైర్లు**

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై శనివారం జరిగిన దాడిని, దీనిపై ఆయన కేంద్రంపై చేసిన ఆరోపణలను బిజెపి ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఖండించారు. కేజ్రీవాల్‌కు మాత్రమే ఇటువంటి ఘటనలు జరుగుతాయి ఎందుకని అంటూ ఢిల్లీ వాసులు ఆశ్చర్యానికి గురవుతున్నారని సచ్‌దేవ ఎద్దేవా చేశారు. మాలవీయ నగర్‌లో కేజ్రీవాల్‌పై జరిగిన ద్రావకం దాడి ఆప్ చేసిన స్టంట్ అని, ప్రజల్లో సానుభూతి పొందేందుకు ఆ పార్టీ స్వయంగా ఆ ప్లాన్ వేసిందని సచ్‌దేవ ఆరోపించారు. కేజ్రీవాల్‌పై పోసింది నీళ్లే తప్ప ఆప్ నేతలు ఆరోపిస్తున్నట్లు స్పిరిట్ కాదని ఆయన వివరించారు. ఈ విషయంపై పోలీసులు స్పష్టత ఇచ్చారని సచ్‌దేవ గుర్తు చేశారు.

## జిల్లా పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**జగిత్యాల బ్యూరో ( మన వెలుగు) డిసెంబర్ 01 :**జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకొని నెల రోజులు డిసెంబర్ 1 నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా మరియు ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతి భద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## ట్యాంకులు నిర్మించారు పైపులైన్ వేశారు నీటి సరఫరా మరిచారు

### చుక్క నీరు కూడా రాని కట్లకుంట మిషన్ భగీరథ పథకం





**జగిత్యాల ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నీటి సరఫరా పథకం ఈ గ్రామానికి వర్తించలేదు వివరాల్లో కి వెళితే.. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నీటిని ప్రతి ఇంటి ముంగిలికి చేరే విధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం కట్లకుంట గ్రామంలో అమలు కాలేదు అధికారుల నిర్లక్ష్యము నాయకుల వైఫల్యము తెలియదు కానీ ట్యాంకు నిర్మించి నా నుండి ఒక్క చుక్క నీటిని కూడా గ్రామ పొలిమేర దాటి గ్రామంలోకి ఇన్ని సంవత్సరాల కాలంలో ఒక్క చుక్క కూడా నిరు రాలేదు గ్రామంలో నీటికి ప్రతి వాడ లో లెక్కకు మించి సమస్యలు ఉన్నాయి పలు వార్డులలో స్వచ్ఛందంగా బోర్లు నిర్మించుకొని ఒక్కో బోరు కు 40 నుండి 50 నీటి కలెక్షన్లు బిగించుకొని వంతుల వారిగా పలు కుటుంబాలు నీటిని వాడుచున్నాయి ఇట్టి బోర్లకు నీటిని వాడుతున్న కుటుంబాలే మరమ్మత్తులు చేయించుకోవలసిన పరిస్థితి ఉంది వార్డులలో ఎవరి ఇంటిలోనైనా శుభకార్యాలు జరుగుతే మొట్టమొదటిగా నీటి కొరకు ఇతరులను ప్రాధేయపడి అవసరాలను తీర్చుకునే పరిస్థితి కట్లకుంట గ్రామంలో నెలకొని ఉంది వీటికి తోడు ఇప్పుడే అడుగంటుతున్న భూగర్భ జలాలు ఇప్పుడే ఇలా ఉంటే వేసవికాలంలో పరిస్థితి అంచనా వేసే పరిస్థితి లేదు వేసవికాలంలో నిత్య అవసరాలు తీర్చుకో వడానికి నీరు లేక గ్రామంలోని కొన్ని కుటుంబాలు వేసవికాలం వచ్చింది మొదలు గ్రామం విడిచి పట్టణాలలో అద్దె ఇళ్లలో నాలుగు నెలల కాలాన్ని వెళ్లదీస్తున్నారు.

## బస్ డిపోలో ఘనంగా వనభోజనాలు



**మెట్ పల్లి (మన వెలుగు) డిసెంబర్ 01 :**టిజిఎస్ఆర్టిసి ఎండి సజ్జనార్ ఆదేశానుసారం మెట్ పల్లి బస్ డిపోలో కార్తీక మాసం పురస్కరించుకొని వనభోజనా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు డిపో మేనేజర్ పి దేవరాజ్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొనగా ఇట్టి కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు జరిపించి గెలుపొందిన సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు బహుమతులు ప్రధానం చేశారు ఈ సందర్భం గా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది విధులలో చాలా ఒత్తిడికి లోనవుతారు కాబట్టి డిపో సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపడానికి గతంలో బతుకమ్మ పండగను మరియు కార్తిక వనభోజనా మహోత్సవాన్ని ఆర్టీసీ సిబ్బందితోపాటు కుటుంబ సభ్యులను భాగస్వాములను చేసి నిర్వహిస్తున్నామని అన్నారు కార్యక్రమంలో ఆఫీస్ సూపరిండెంట్ పవన్ సెక్యూరిటీ ఆగయ్య ఏఎంఎఫ్ ఎల్ ఆర్ కే రెడ్డి నగేష్ రాఘవ నాగన్న మహేష్ మరియు ఆర్టీసీ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం బాసర మండలంలో చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరణ ప్రకారం మొదలు మండల కేంద్రానికి చెందిన టీవీఎస్ మోపెడ్ ఏపీ జెడ్ ఎయిట్ బిఎస్ 4508 పని నిమిత్తం మహారాష్ట్ర ధర్మాబాద్ వెళ్లి తిరిగి వస్తాను బెదిరిల్లి గ్రామం వద్ద కల్వర్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు

# రైతు సంబరాలపై ఆనందం వ్యక్తం చేసిన జువ్వాడి కృష్ణారావు



**జగిత్యాల బ్యూరో ( మన వెలుగు) డిసెంబర్ 01 :**కోరుట్ల పట్టణంలో గల జువ్వాడి కృష్ణారావు స్వగృహం జువ్వాడి భవన్లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి కావస్తున్న సందర్భంగా నిర్వహించిన రైతు సంబరాల్లో రైతులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 18 వేల కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందని కొన్ని సాంకేతిక కారణాల వల్ల మిగిలిన రైతులకు కూడా త్వరలోనే రుణమాఫీ చేస్తామని శనివారం నిర్వహించిన రైతు పండుగలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేయడం జరిగిందన్నారు రుణమాఫీ కాకుండా మిగిలి ఉన్న 2740 కోట్ల రుణమాఫీ త్వరలోనే పూర్తి చేస్తామని రైతు బీమా తో పాటు సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని కేవలం అయిలాపూర్ గ్రామంలోనే 44 మంది రైతులకు 3376 క్వింటాళ్ల వరి ధాన్యానికి 16 లక్షల 88 వేల 100 రూపాయల బోనస్ ఇవ్వడం జరిగిందన్నారు కోరుట్ల నియోజకవర్గ పరిధిలో 15957 మంది రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు ప్రభుత్వమని రేవంత్ రెడ్డి పాదయాత్రలో భాగంగా కోరుట్ల నియోజకవర్గ పరిధిలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వద్ద బస చేసినప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తప్పకుండా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని మాట ఇవ్వడం జరిగిందన్నారు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ సూచన మేరకు 4 బ్యాంకుల్లో ఉన్న 175 కోట్ల రుణాన్ని ప్రభుత్వం చెల్లించిందని మిగతా 25 వేల కోట్లు మేనేజ్మెంట్ వారు చెల్లించడం జరిగిందన్నారు త్వరలోనే ఫ్యాక్టరీ పున ప్రారంభం కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు ఎన్నికల్లో వచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఆరోగ్య శ్రీ 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థుల సౌకర్యార్థం 40శాతం మెస్ చార్జీలు పెంచడం జరిగిందన్నారు కోరుట్ల పట్టణంలో త్వరలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రారంభించడం జరుగుతుందన్నారు ఎన్ఆర్ఐజిఎస్ నుంచి 5 కోట్ల రూపాయలు ఏస్ డి ఎఫ్ నుంచి 10 కోట్ల రూపాయలు చిన్న చిన్న మౌలిక వసతుల కోసం ప్రభుత్వం మంజూరు చేయడం జరుగుతుందన్నారు అంగన్వాడీల కోసం 12 లక్షల రూపాయలతో అంగన్వాడి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు రైతుల సౌకర్యార్థం వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ ద్వారా మంజూరు చేయడం జరుగుతుందని అందులో డ్రిప్ ద్వారా నీటిని పొదుపు చేయవచ్చునన్నారు గల్ఫ్ దేశంలో మృతి చెందిన గల్ఫ్ బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఐదు లక్షల రూపాయల మంజూరు చేయడం జరుగుతుందన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు కోరుట్ల నియోజకవర్గంలో మృతి చెందిన 8 మంది గల్ఫ్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఐదు లక్షల రూపాయలు మృతుల కుటుంబాలకు అందజేయడం జరిగిందన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు రైతుల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు రైతు బీమా కూడా కొనసాగుతుందని అలాగే అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల కోసం ఇన్సూరెన్స్ కూడా చేయడం జరిగిందన్నారు విద్య వైద్యంపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు ఈ సమావేశంలో కోరుట్ల పట్టణకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి పుల్లూరి వెంకటేష్ గౌడ్ ఎం ఏ నయిం కార్యదర్శి మ్యాకల నర్సయ్య యువజన కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి కౌన్సిలర్ ఎంబేరి నాగభూషణం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నం అనిల్ పుప్పాల ప్రభాకర్ సోగ్రాభి కట్కమ్ దివాకర్ చిట్యాల లక్ష్మీనారాయణ కాసా సంజీవ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల గంగాధర్ నేతి శ్రీనివాస్ తెడ్డు విజయ్ సోహైల్ నసీర్ షేక్ మహ్మద్ రసూల్ బుస రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ఉద్యోగులు ఎంత ఎదిగిన ఒదిగి ఉండాలి

### - డీఎంహెచ్ఓ డాక్టర్ అలం అప్పయ్య




**ములుగు ప్రతినిధి ( మన వెలుగు) డిసెంబర్ 01 :**ఉద్యోగులు ఎంత ఎదిగినా ప్రజల వద్ద ఒదిగి ఉండాలని డిఎంహెచ్వో డాక్టర్ అలం అప్పయ్య అన్నారు ఆదివారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు గత ఆరు సంవత్సరాలుగా ములుగు జిల్లా వైద్యాధికారిగా సేవలందించిన డాక్టర్ అప్పయ్య బదిలీపై హనుమకొండ డిఎంహెచ్వో గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివాసి ఉద్యోగుల సంఘం లోతట్టు గ్రామాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు సన్మాన కార్యక్రమం జరిగింది ములుగు మండలంలోని మారుమూల అంకన్న గూడెం గ్రామంలో జన్మించిన తాను ఎంబిబిఎస్ చదవడం కోసం అనేక కష్టనష్టాలు వచ్చానని చెప్పారు విద్య విద్యార్థి దశలో ఉన్నప్పుడు తన సోదరి పుట్టినప్పులతో బాధపడుతూ పురిటిలోనే బిడ్డను కోల్పోయింది అన్నారు ఈ సంఘటన తర్వాతే తాను వైద్య వృత్తిని చేపట్టాలని ఆకాంక్ష కసితో చదివాను అన్నారు నేటి విద్యార్థులు కూడా ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు పాటుపడాలని తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పైకెదగాలన్నారు ఈ సందర్భంగా డాక్టర్ అప్పయ్యను ఘనంగా సన్మానించారుఈ సన్మాన కార్యక్రమంలో ఆదివాసి ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు రవి వజ్జ.రాజు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు. రవి చందర్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి. రాజేందర్ గౌడ్ ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షులు ముంజాల. బిక్షపతి గౌడ్ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్ శిరప సతీష్ ఎల్ల మధు ఆదివాసి ఉద్యోగులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కూచిపూడి భరతనాట్య నృత్య ప్రదర్శనలు



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం బాసరలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కార్తీక మాసం సందర్భంగా గత నెల రోజులుగా ప్రతిరోజు ప్రదోషకాలంలో ఆలయంలో సామూహిక దీపోత్సవము మరియు వివిధ కళా బృందముల చే కూచిపూడి భరతనాట్య నృత్య ప్రదర్శనలు సంగీత విభావరి ఆధ్యాత్మిక ప్రవచనములు విశేష పూజలు గోదావరి నది తీరంలో గల శివాలయంలో రుద్ర త్రిశతినామార్చన భస్మహారతి అన్న పూజ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము జ్వాలా తోరణం కార్తీక పౌర్ణమి సందర్భంగా నదిహారతి కార్యక్రమం మొదలగు కార్యక్రమాలు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో దేవస్థాన సహాయ కార్యనిర్వాహణాధికారి వైదిక మరియు పరిపాలన సిబ్బంది భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారితో పాటుగా శివకేశవుల కృపకు పాత్రులు అయ్యారు. నేడు అమావాస్యతో కార్తీకమాస ఉత్సవములు ముగుస్తున్నవని తెలిపారు.

# కాంగ్రెస్ పై కరీంనగర్ బిజెపి చార్జిషీట్




### కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అన్ గ్యారంటీలు

### ప్రజలను మోసం చేశామని విజయోత్సవాలు చేసుకుంటున్నారా..?

### బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తుంది

### బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**కరీంనగర్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలు, హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిందని బిజెపి కరీంనగర్ జిల్లా శాఖ ఆదివారం రోజున కాంగ్రెస్ పై చార్జిషీట్ విడుదల చేసింది . బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి, కృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి చార్జి షీట్ విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమకు ద్రోహం చేసిందన్న ఆగ్రహం ప్రజల్లో తీవ్రంగా ఉందన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ అభయ హస్తం మేనిఫెస్టో లోని హామీలు, ఆరు గ్యారంట ల అమలుపై కాంగ్రెస్ దాటవేత ధోరణి అవలంబిస్తుందన్నారు.అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పిందని, నేడు ఆరు గ్యారంటీలు అన్ గ్యారెంటీగా మారాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాల కోసం గత 11 నెల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పేరిట స్వీకరించిన దరఖాస్తులు ఏమయ్యాయని ఆయన సందర్భంగా ప్రశ్నించారు. ముఖ్యంగా మహిళలను మహాలక్ష్మి పథకంతో, రైతు భరోసాతో రైతులను, ఇందిరమ్మ ఇండ్ల పథకంతో నిరుపేదలను, యువ వికాసంతో విద్యార్థిని విద్యార్థులను, చేయుత పథకంతో పెన్షన్ దారులను , ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయని , కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజానీకాన్ని దారుణంగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అంటేనే నయ వంచన, మోసం అనే భావన ఏర్పడింద న్నారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై వ్యతిరేకతతో ఉంటే విజయోత్సవ సభలు నిర్వహించుకోవడం సిగ్గుచేటన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను , మోసాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. చార్జిషీట్ విడుదలకు ముందు జిల్లా సభ్యత్వ నమోదుపై రివ్యూ సమావేశం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట్ రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు , ఉపాధ్యక్షులు గుర్రాల వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, ఎర్రబెల్లి సంపత్ రావు, కళ్లెం వాసుదేవ రెడ్డి, కన్నబోయిన ఓదెలు జిల్లా అధికార ప్రతి బొంతల కళ్యాణ్ చంద్ర , ఎడమ సత్యనారాయణ రెడ్డి , అలివేలు సమ్మిరెడ్డి , దండు కొమురయ్య, పుప్పాల రఘు, కరివేద మహిపాల్ రెడ్డి, దుబాల శ్రీనివాస్, గౌతమ్ రెడ్డి , వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల పక్షం తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY


# సురభి కాలనీ వాసులకు అండగా ఉంటా

### కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



**శేర్లింగంపల్లి (మన వెలుగు) డిసెంబర్ 01:**శేరిలింగంపల్లి డివిజన్ లోగల సురభి కాలనీలో ఇటీవల జరిగిన సురభి కళాకారుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో భాగంగా నూతనంగా ఎన్నికైన అసోసియేషన్ వారు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ ని శాలువతో ఘనంగా సత్కరించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులను ఉద్దేశించి నూతనంగా ప్రెసిడెంట్ లుగా ఎన్నికైన శేఖర్, వెంకట్ రెడ్డి కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు జవాబుదారీగా పని చేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్డు, ప్లే గ్రౌండ్ లో ఐమాస్ లైట్, తదితర డిమాండ్ లను సానుకూలంగా స్పందిస్తూ సాయిశక్తుల కృషి చేస్తానని అన్నారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణను గాడిలో పెట్టాలని ఆ విభాగాల అధికారులను ఫోన్ లో ఆదేశించారు. సురభి కాలనీలో దాదాపుగా సీసీ రోడ్లు పూర్తవుగా మిగిలిన ఒకటి, రెండు బిట్ లను త్వరితగతిన పూర్తి చేయిస్తానని అన్నారు. అనంతరం సురభి కాలనీ అభివృద్ధిలో భాగంగా మౌలిక సదుపాయాల కొరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సురభి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ ఏ చంద్రశేఖర్, ఆర్ వెంకట్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జయ కృష్ణ, సెక్రటరీ వెంకట భాను, జాయింట్ సెక్రటరీ జితేందర్ రెడ్డి, ట్రెజరర్ సుధ, గౌరవ సలహాదారులు సుబ్బారావు, ఆర్ కోదండరావు, మాజీ సెక్రటరీ రమణ కుమార్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# హిందువులపై దాడులనుకు నిరసనగా ఈ నెల 4న వి నిరసన దీక్ష



**ఆదిలాబాద్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**బంగ్లాదేశ్ హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. హిందువులు ఎప్పుడు కూడా అందరు బాగుండాలని కోరుకుంటారని అన్నారు. ఇస్కాన్ సంస్థ కుల మతాలకతీతంగా పనిచేస్తాయని అన్నారు. బంగ్లాదేశ్ ఇస్కాన్ ఆలయాలపై హిందువులపై జరుగుతు న్న దాడులను ప్రపంచం మొత్తం ఖండిస్తుందన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరు ఖండించవలసిన అవసరం ఉందన్నారు. బంగ్లాదేశ్లో హిందువులపై జరుగుతున్న దాడులం ఖండిస్తూ లిఈనెల 4న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్ లో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని హిందూ బంధువులందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారులి బంగ్లాదేశ్ హిందువులకు తాము అండగా ఉన్నామని భరోసా కల్పిద్దామన్నారు కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్. నగేష్ .ఆకుల ప్రవీణ్ .కృష్ణ యాదవ్. జోగు రవి. దినేష్ మాటోలియ. విజయ్.రాజన్న. సోమా రవి. దయాకర్. అర్జున్. తదితరులు ఉన్నారు

# కొండగట్టు అంజన్నను, వేములవాడ రాజన్నను దర్శించుకున్న సినీ హీరో శ్రీకాంత్



**జగిత్యాల/వేములవాడ ( మన వెలుగు) డిసెంబర్ 01 :**ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామిని, ఆదివారం ఉదయం ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్, దర్శకులు చంద్రకాంత్,నిర్మాత విజయ్ లు కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు.ఆదివారం ఉదయం ఆలయానికి చేరుకున్న శ్రీకాంత్‌కు అర్చకులు, అధికారులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి శ్రీకాంత్ ప్రత్యేకపూజలు చేశారు. పూజానం తరం వేదపం డితులు నటుడికి ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజే శారు. అంతకు ముందు వేములవాడ రాజన్నను శ్రీకాంత్ వేకువ జామునే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాంత్ కొండగట్టు రావాడంతో అతడిని చూడడానికి భక్తులు ఎగబడ్డారు.

# అర్ధరాత్రి సమయంలో హాస్టల్లో ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు






**- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన**

**-గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కుక్కల స్వైర విహారం చేస్తున్న దృశ్యం**

**- పట్టించుకోని హాస్టల్ వార్డెన్**

**మహబూబాబాద్ (మన వెలుగు) డిసెంబర్ 01 :**జిల్లా కేంద్రంలోని ఆర్డిఓ ఆఫీస్ పక్కనగల బాలికల ఆశ్రమ పాఠశాలలో లంబాడి హక్కుల పోరాట సమితి బృందం సందర్శించడానికి వెళ్ళాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన ఏమనగా గత వారం రోజుల క్రితం రాత్రి సమయంలో వసతి గృహంలో బాత్రూం వెనక భాగము నుండి కొంతమంది గోడ దూకి హాస్టల్లోకి ప్రవేశించగా విద్యార్థినులు భయభ్రాంతులకు గురై అరుపులు కేకలు వేశారు. భయంతో రూమ్ లోకి దాక్కొని ఏడ్చారు ఆ సమయంలో హాస్టల్ వార్డెన్ అందుబాటులోకి రాలేదు హాస్టల్ వార్డెన్ లేకపోవడం చాలా బాధాకరం విద్యార్థులకు అందుబాటులోకి ఉండవలసిన వార్డెన్ సమయపాలన పాటించకుండా వారి సమయాన్ని అదునుగా చేసుకొని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు వసతి గృహంలో చేరి మా గిరిజన లంబాడి విద్యార్థినీలకు భయభ్రాంతులకు గురి చేశారు. సదరు వ్యక్తి గతంలో కూడా రెండు, మూడుసార్లు హాస్టల్లో ప్రవేశించిన కూడా హాస్టల్ వార్డెన్ పట్టించుకోక పోవడంలో ఆంతర్యం ఏముంది ?. అని ప్రశ్నించారు. అదేవిధంగా మరిసటి రోజు మరో గుర్తు తెలియని వ్యక్తి ఎంఈఓ ఆఫీస్ వైపు గల ప్లే గ్రౌండ్ నుండి రాత్రి సమయం లో గేటు దూకి హాస్టల్లో ప్రవేశించిన కూడా హాస్టల్ వార్డెన్ సదరు గుర్తు తెలియని వ్యక్తిపై చర్యలు తీసుకోకుండానే వదిలేశారు. మా ఎల్ హెచ్ పి ఎస్ బృందం ఇట్టి విషయాన్ని హాస్టల్ వార్డెన్ తో విచారణ చేస్తుండగా సదరు వార్డెన్ భర్త పోలీస్ కానిస్టేబుల్ కావడంతో 100 డయల్ పేరుతో ఒక కానిస్టేబుల్ ను పంపించి మాపై దౌర్జన్యం చేపించాడు. సదరు కానిస్టేబుల్ మీ అంతు చూస్తాం అని భయభ్రాంతు లకు గురి చేస్తూ వెనుక నుండి వార్డెన్ భర్త మాపైన ఉసిగొలుపుతున్నాడు. గతంలో గూడూరు బాలికల ఆశ్రమ పాఠశాలలో కూడా వార్డెన్ భర్త ఆయన పోలీస్ కానిస్టేబుల్ మా గిరిజన లంబాడి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో సదరు అనిత హాస్టల్ వార్డెన్ సస్పెండ్ చేయడం జరిగింది. సదరు వార్డెన్ మహబూ బాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాలలో కూడా అదే పని తీరును కొనసాగిస్తున్నారు. ఈరోజు హాస్టల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్న కూడా హాస్టల్ వార్డెన్ పట్టించుకోవ డం లేదు. హాస్టల్ వార్డెన్ తన ఇంట్లో హాస్టల్ లో పనిచేసే వర్కర్లతోని పాచి పనులు చేయించుకుంటున్నారు. అదేవిధంగా హాస్టల్ ఎంట్రన్స్ లో ఉండే సీసీ కెమెరాలు పనిచేయకుండా చేసి అవినీతి అక్రమాలకు రాజ్యమేలుతు న్నారు. అదేవిధంగా సమయపాలన పాటించకుండా విద్యార్థులకు సరైన మెనూ ప్రకారం భోజనం అందించకుం డా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారు. సమయపా లన పాటించకుండా విద్యార్థులకు రక్షణ కల్పించకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న వార్డెన్ పై జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారితో సమగ్ర విచారణ జరిపించి తక్షణమే సస్పెండ్ చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి డిమాండ్ చేస్తుంది. లేని యెడల ఎల్ హెచ్ పి ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని హెచ్చరించారు.

# కాంగ్రెస్ నుంచి బిజెపిలో చేరిన దేగాం గ్రామస్తులు



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**భైంసా మండలంలోని దేగాం గ్రామానికి తాజా మాజీ వార్డ్ మెంబర్ భోజరాం పటేల్, మాజీ గ్రామ అభివృద్ధి కోశాధి కారి బెల్గాం పోతన్న, తో పాటు అల్లం సాయినాథ్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సమక్షంలో బిజెపి పార్టీలో చేరారు. పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే వారిని ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అండ దండ గా ఉంటానని, ఎవరికి భయపడవద్దని సూచించారు. దేగాం గ్రామ అభివృద్ధికి తనవంతుగా పాటుపడతానన్నారు. దేగాం గ్రామం అభివృద్ధి పరంగా ఎంతో వెనకబడిందని, ప్రజలు బిజెపిలో చేరడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిపెల్లి గంగాధర్,బిజెపి అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్,నాయకులు సొలంకి భీమ్ రావ్ బిజెపి జిల్లా సభ్యత్వ నమోదు కోఆర్డినేటర్ సిరం సుష్మారెడ్డి, స్థానిక నాయకులు కిష్టయ్య, చంద్రకాంత్ పటేల్, లింగన్న, ప్రకాష్, తో పాటు పలువురు పాల్గొన్నారు.

# చలో మాల సింహగర్జన



**నిర్మల్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**వర్గీకరణ పేరుతో జాతిని విడగొడుతున్నారని,విడిపోతే చెడిపోతాం కలిసి ఉంటే రాజ్యం వస్తుంది అంటూ నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అన్నారు. రాజాధికారమే అంతిమ లక్ష్యం అంబేద్కర్ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పద్మారావు అధ్యక్షుడు కొఠారి భూమన్న ఉపాధ్యక్షుడు అల్లం.సతీష్.కార్యదర్శి.పల్లె దేవారావు.ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ప్రత్యేకంగా పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం మండల కేంద్రం నుండి చలో హైదరాబాద్ అంటూ మాలలందరూ సింహ గర్జన కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మాట్లాడుతూ నేడు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించే మాల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుంటామ న్నారు. మాల మాదిగ ఎస్సీ కులాలన్నీ కలిసి ఉంటే రాజ్యంవస్తుందని,విడిపోతే చెడిపోతామని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం రిజర్వేషన్లను కాపాడు కుందామని భారత రాజ్యాంగంలో పొందుపరిచిన నియమనిబంధనలు,చట్టాలను,హక్కులను విధులను గౌరవించి.ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడలలో నడిచి మార్గదర్శకులు కావాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు,సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరట్టు ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**ఆదిలాబాద్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఆరట్టు ఉత్సవం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఎమ్మెల్యే పాయల్ శంకర్ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లకి ఊరేగింపు వేడుకలో పాల్గొన్నారు. మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి తో పాటు దీక్షాపరులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు బీజేపీ నాయకులు లాలా మున్న. ఆకుల ప్రవీణ్. వెనుగోపల్. తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో ఆరట్టు మహోత్సవంలో పాల్గొన్న శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ ప్రతినిధి (మన వెలుగు) డిసెంబర్ 01 :**అరట్టు మహోత్సవం సందర్భంగా బెల్లూరి అయ్యప్ప దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి పల్లకి సేవ, ఊరేగింపులో పాల్గొన్న తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి . ఈ సందర్భంగా పండ్లను పంపిణీ చేయడం జరిగింది. గోపాలకృష్ణ మఠం పీఠధిపతి యోగానందసరస్వతి ఆధ్వర్యంలో ప్రారంభమైన పల్లకి యాత్ర పెన్ గంగ నది వరకు సాగింది. ఈ సందర్భంగా గురుస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీకాంత్ రెడ్డి కి స్వామివారి తీర్థ ప్రసాదలను అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో బెల్లూరి అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షు లు దారట్ల జీవన్ , అధ్యక్షుడు కుంబోజి సూర్యకాంత్, ప్రధాన కార్యదర్శి దమూక రవీందర్ ట్రెజరర్ టింగం నరేష్, గురుస్వాములు అనిల్ దేశ్ పాండే,సత్యనారయణ మూర్తి,,సునీల్,రాము,సాయినాథ్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి, సాయిని రవి గంగరెడ్డి,రవిందర్ రెడ్డి. కాంగ్రెస్ నాయకులు ధర్మపురి చంద్రశేఖర్,నవీన్ రెడ్డి,గంద్రత్ వెంకటెష్ గోవర్ధన్ రెడ్డి, నాగరాజు, ఆలీం తదితరులు పాల్గొన్నారు.

## ఎడిటోరియల్

# నిషిద్ధ స్వప్నం



బాల్య వివాహాలు చాలా పాతకాలం నాటి మాట. నేటికీ కొనసాగుతున్న తాజా అనాచారం. ఆడది అవనిలో సగం.. ఆకాశంలో సగంశౌ% అని నిరూపించుకుంటున్న ఈ రోజుల్లోనూ బాల్య వివాహాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరికి 18 ఏళ్ల లోపే వివాహం జరుగుతున్నట్లు 'ది లాన్సెట్ జర్నల్' వెల్లడించింది. అంతేకాదుశౌ%కోవిడ్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా చదువులు చతికిలబడ్డాయి. పేదరికం పెరిగిపోయింది. ఫలితంగా వచ్చే దశాబ్ద కాలంలో కోటి మంది బాలికలుశౌ%వివాహ చట్రంలో ఇరుక్కుపోనున్నారు. ఏటా 1.2 కోట్ల మంది బాల్యంలోనే వివాహ వ్యవస్థలోకి నెట్టబడతారని లాన్సెట్ చెబుతోంది. బాల్య వివాహాలు ఆడపిల్లల ఆరోగ్యానికి, జీవితానికి ముప్పుగా మారతాయి. ఎదిగీ ఎదగని శరీరం, అవగాహనలేని వయసు, పరిపక్వతలేని మనసు, అమ్మపై ఆధారపడే వయస్సులో అమ్మగా మారడం ఆ చిన్నారి ఎదుగుదలకు ఆటంకం. 'మాకు ఈడు లేదు ఇగురం లేదు ఓ ఎమ్మాలో/ ఇంతలోనే పెళ్లి అంటారా?.. మా ఎమ్మాలో/ సంసారమీద సత్తువ ఉందా?.. ఓ ఎమ్మాలో/ నా బాల్యమంత బందీ జేస్తారా?.. ఓ ఎమ్మాలో/ వద్దే వద్దమ్మ నాకు బాల్య వివాహం బడి ఈడులోనే బండెడంత బాధ్యత భారం' అంటారో కవి. బాల్య వివాహాలు నిరోధించడానికి రాజారామ్ మోహన్‌రారు, కందుకూరి వీరేశలింగం వంటివారు కృషి చేసినాశౌ% ఈ మూఢాచారం నేటికీ కొనసాగుతోంది.తల్లి గర్భం నుంచే సమాజంతో నిత్యం పోరాటం చేయాల్సిన పరిస్థితి బాలికలది. సాధ్యమైనంత త్వరగా ఆడపిల్లకు పెళ్లి చేసి వదిలించుకోవాలన్న పురుషాధిక్య భావజాలం ఆడపిల్ల అందమైన కలలను, భవితను, జీవితాన్ని చిదిమేస్తోంది. 'బాల్యంలో/ బొమ్మకు అమ్మనయ్యానని సంతోషించాను/ ఇప్పుడు/ అమ్మనూ నేనే, బొమ్మనూ నేనే' అంటారు కవయిత్రి అంజన. చదువు, ఆటపాటలతో ఎదగాల్సిన బాలికలుశౌ% చిన్న వయసులో పెళ్లి వల్ల శారీరకంగా, మానసికంగా బలహీనులవుతారు. శారీరక, మానసిక పరిపక్వత లేని వయసులో గర్భం ధరించడం వల్ల మాతాశిశు మరణాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల చిన్నతనం నుంచే వారి హక్కులు ఉల్లంఘించబడుతూ, ఆర్థిక పరాధీనతను పెంచుతున్నాయి. 'బాల్య వివాహాలు బానిసత్వం యొక్క ఒక రూపం. దానిని రద్దు చేయాలి' అంటారు నెల్సన్ మండేలా. బాల్య వివాహాలు సామాజిక దురాచారం. వీటిని అరికట్టడం వలన మాతా శిశు మరణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుంది. దేశవ్యాప్తంగా బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్న ఏడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. దేశంలో దాదాపు 300 జిల్లాల్లో జాతీయ సగటుతో పోలిస్తే బాల్య వివాహాల రేటు ఎక్కువగా వుందని తాజాగా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిగా 1929లో బాల్య వివాహాలు నిషేధించబడ్డాయి. ఆ తర్వాత క్రమంగా పరిస్థితి మరింత మెరుగుపడుతూ వచ్చింది. అయినా నేటికీ బాల్య వాహాలు జరుగుతూనే వున్నాయి.18 ఏళ్లలోపు బాలికలు, 21 ఏళ్ల లోపు బాలురకు వివాహాలు చేస్తే, తల్లిదండ్రులతోపాటు వివాహం చేసిన వారికి కూడా రెండేళ్లపాటు జైలుశిక్ష విధిస్తారని చట్టం చెబుతోంది. బాలలకు చట్టంలో సమానత్వం వుందని, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం రావాలని తాజాగా కేంద్ర ప్రభుత్వం 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమం చేపట్టింది. 2030 నాటికి బాల్య వివాహ రహిత భారతదేశమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ప్రభుత్వం చెబుతోంది. మరోవైపున దేశవ్యాప్తంగా బాల్యవివాహాలు నిరాఘాటంగా జరుగుతున్నాయి. 'ఆడదే ఆధారం/ మన కథ ఆడనే ఆరంభం/ ఆడదే సంతోషం/ మనిషికి ఆడదే సంతాపం' అంటాడో సినీ కవి. మనిషి కథ ఆరంభమైన చోటనేశౌ% అంతం కాకూడదు, అది సంతాపంగా మారకూడదు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు. బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేది, వారి జీవితాన్ని వెలుగు దివ్వెగా మార్చేది, పురుషాధిక్యతను ప్రశ్నించేది చదువు మాత్రమే. ఇది నిషిద్ధ స్వప్నం కాదు.

# కాంగ్రెస్ కు 'మహా'పాఠం

రాజకీయంగా ఆర్థికంగా దేశంలో అత్యంత కీలక పాత్ర వహించే మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు బిజెపి, ఎన్‌డిఎలకు అమితానందం కలిగిస్తే కాంగ్రెస్, 'ఇండియా' వేదికకు తీవ్ర నిరుత్సాహానికి గురిచేశాయి. నవంబరు 20న పోలింగ్ ముగిసిన ఈ రాష్ట్రంలో ఫలితాలు 23వ తేదీన వెలువడ్డాయి. సాధారణ అంచనాలు ఎగ్జిట్ పోల్స్ లెక్కలు తారుమారయ్యాయి. బిజెపి, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి చీలిక వర్గాలతో ఏర్పడిన పాలక మహాయుతి కూటమి 288 స్థానాలలో 230 పైగా తెచ్చుకుని ఘన విజయం సాధించింది. బిజెపికి 132, ఏక్‌నాథ్ షిండే శివసేనకు 57, అజిత్ పవార్ ఎన్‌సిపిఎ కి 41 వచ్చాయి. మరోవైపున ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్ థాకరే), ఎన్‌సిపి (శరద్ పవార్) లతో కూడిన మహా వికాస్ అగాఢీ కూటమి పార్టీలలో ఏ ఒక్కటీ ప్రతిపక్ష హోదా కూడా పొందలేకపోయాయి. నిజానికి సేన, ఎన్‌సిపి మూల సంస్థలు ఎంవిఎలో వున్నా పోటీ నేతలతో చీలిపోయిన వర్గాలే అధిక స్థానాలతో వీళ్లను వెనక్కు నెట్టేశాయి. ఆరు మాసాల కిందట జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఎంవిఎ 30 స్థానాలు తెచ్చుకుని సంచలనం సృష్టించింది. మహాయుతి కేవలం 17 స్థానాలకే పరిమితమైంది. అదే సమయంలో రెండు కూటముల మధ్య ఓట్ల తేడా కేవలం 0.4 శాతం మాత్రమే వుండటం వల్ల శాసనసభ ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.

లోక్‌సభ ఓటింగులో జాతీయ రాజకీయ కోణాలు ప్రధానంగా పని చేస్తాయి. శాసనసభ ఎన్నికలు రాష్ట్రాలను బట్టి జరుగుతాయి. అక్కడ ఎక్కువ స్థానాలు వచ్చినా అసెంబ్లీ వ్యవహారం భిన్నంగా వుండొచ్చని గతంలో చాలా సార్లు రుజువైంది. అందుకే 'ఇండియా' వేదిక, ప్రత్యేకించి ప్రధాన పాత్ర వహించే కాంగ్రెస్ వాస్తవికత చూపించాలని పరిశీలకులు, భాగస్వామ్య పక్షాలు పదేపదే హెచ్చరిస్తూ వచ్చాయి. హర్యానాలో లోక్‌సభ ఎన్నికలలో సరిసమానంగా సీట్లు తెచ్చుకుని అధికారంలోకి రావడం ఖాయమని హడావుడి చేసిన కాంగ్రెస్ ఘోరంగా దెబ్బతిన్న అనుభవం పని చేస్తుందని భావించారు. లౌకిక శక్తుల ఐక్యతకు సర్దుబాట్లకు ప్రాధాన్యతనివ్వకపోవడమే హర్యానాలో కాంగ్రెస్ ఓటమికి కారణమని తేల్చి చెప్పారు. దీనికి అంతర్గత అనైక్యత కూడా తోడై పరాజయం తీవ్రమైంది. మహారాష్ట్రలోనైనా అలాంటివి మార్చుకోకపోగా అంతకంటే ఘోరంగా దెబ్బతినడం వారికే దిగ్భ్రాంతి కలిగించింది. శివసేనపై ఉద్ధవ్ థాకరే పట్టు సడలిందా, ఎన్‌సిపి కౌటిల్యుడు శరద్ పవార్ ప్రభ తగ్గిందా వంటి ప్రశ్నలూ ముందు నిలిచాయి. మరోవైపు అంత విజయం సాధించిన బిజెపి కూటమి కూడా ముఖ్యమంత్రి ఎంపిక పూర్తి చేసుకోలేకపోవడం బట్టి రాజకీయ సవాళ్లు అర్థమవుతాయి. ఇప్పటికే షిండే అలిగి ఊరెళ్లిపోయారు. అయితే ఏదోవిధంగా అవసరమైతే షిండేను తప్పించైనా సరే బిజెపి దేవేంద్ర ఫడ్నవిస్‌కే పదవి కట్టబెడుతుందని అందరికీ తెలుసు. ధృతరాష్ట్ర కౌగిలిలా బిజెపితో మరీ ముఖ్యంగా మోడీతో అంటకాగిన వారు ఆఖరుకు ఏమవుతారో చెప్పే ఉదాహరణ షిండే. అయినా తెలుగునాట కొందరు నేతలు అందుకు ఆరాటపడుతున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది.

మహారాష్ట్రలో ఎంవిఎ సీట్ల సర్దుబాటు చర్చల నుంచి నియోజక వర్గాల కేటాయింపు వరకూ అస్తవ్యస్తంగానే జరిగింది. మూడు ప్రధాన పార్టీలే తేల్చుకోలేకపోగా వామపక్షాలు, ఇతర లౌకిక పార్టీలతో సకాలంలో సరైన చర్చలే జరగలేదు. మరోవైపు బిజెపి ఎలాగైనా లోక్‌సభ ఫలితాలను మార్చి అధికారంలోకి రావడమే ఏకైక ధ్యేయంగా వ్యవహరించింది. చివరి మాసాలలో 'లడ్కీ బహెన్ యోజన' వంటి పథకాలను ప్రకటించి రూ.1500 ఆగమేఘాల మీద బదిలీ చేసింది. ఎంవిఎ రూ.3000 ఇస్తామని వాగ్దానం చేసినా అధికారంలో వుండి తక్షణం ఖాతాల్లోకి పంపించారు గనక ఎక్కువ పనిచేసిందని చెబుతున్నారు. దీనికి తోడు కుల, మత ప్రచారాలను మహాయుతి నేతలు దారుణంగా సాగించారు. కలసి వుండాలని చెబుతున్నట్టుగా ఏక్ హైతో సేఫ్ హై (కలిసి వుంటే మనం సురక్షితంగా ఉంటాము), బాటేంగే తో కటేంగే (చీలిపోతే కూల్చేస్తారు) వంటి నినాదాలతో హిందూ మతతత్వ రాజకీయాలను ప్రచారం చేశారు. మోడీ, హోం మంత్రి అమిత్ షా, యు.పి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ల త్రయం తోడు ఆర్‌ఎస్‌ఎస్ నేరుగా రంగంలోకి దిగి ఇంటింటికీ తిరిగి జాతీయత, మతం అంటూ ప్రచారం నడిపించింది. అసలు తమ వల్లనే ఈ విజయం సాధ్యమైందని కూడా వారి వాదనగా వుంది.

ఎంవిఎను తికమక పెట్టేందుకు గాను శరద్ పవార్ బిజెపితో చేతులు కలిపారనే ప్రచారం నడిపించారు. 2019లో బిజెపిని బలపర్చడానికి శరద్ పవార్ ఆదేశాలపైనే బిజెపితో చర్చలు జరిపామనీ, అప్పట్లో అదానీ కూడా ఆ చర్చలలో పాల్గొన్నారని అజిత్ పవార్ వెల్లడించారు. అదానీ ఇంట్లో చర్చలు జరిగాయి గానీ ఆయనతో భోజనం మాత్రమే చేశామనీ చర్చలలో లేరనీ శరద్ పవార్ వివరణ ఇచ్చినా కలసిన సంగతి మాత్రం కొట్టివేయలేదు. అంతేగాక అజిత్ పవార్‌తో ఆయన కుటుంబ సంబంధాలు కూడా లేనిపోని చర్చలయ్యాయి.కూటమిలో తనకే అత్యధిక స్థానాలలో పోటీ చేయాలని పట్టుపట్టిన కాంగ్రెస్ ప్రచారంలో అంత పదునుగా పాల్గొనలేదు. ఆఖరుకు రాహుల్ గాంధీ కూడా పరిమితంగా తప్ప మీద వేసుకుని ప్రచారం చేసింది లేదు. సంప్రదాయ శివసేన ఓటర్లను ఉద్ధవ్ థాకరే ఆకట్టుకోలేకపోయారు. ఎంవిఎ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ముందే ఉద్ధవ్‌ను ప్రకటించకపోవడంతో మరాఠా ఆత్మగౌరవ భావన దెబ్బతిన్నదనే ప్రచారం ప్రభావం చూపింది. స్వయంగా ఉద్ధవ్ కూడా ముందే సిఎం పేరు ప్రకటించి వుండాల్సిందని అసంతృప్తి వెలిబుచ్చారు. సిపిఎం, సిపిఐ, ఎస్‌పి వంటి పార్టీలను కలుపుకోవలసిన అవసరాన్ని అసలే గుర్తించలేదు. లోక్‌సభ ఎన్నికలలో సిపిఎంకు సీటే కేటాయించకపోయినా ఓట్ల చీలిక నివారించడం కోసం పోటీ చేయకుండానే మద్దతునిచ్చింది. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికలలోనూ అనేక విమర్శల తర్వాత మూడు స్థానాలకు అంగీకరించి మళ్లీ ఒకచోట పోటీ పెట్టింది కాంగ్రెస్. దహను, సోలాపూర్, కల్వాన్‌లలో సిపిఎం పోటీ చేస్తుండగా. సేన, ఎన్‌సిపి మూడు చోట్ల మద్దతునిచ్చినా సోలాపూర్‌లో కాంగ్రెస్ పోటీ చేసి బిజెపి గెలవడానికి కారణమైంది. సిపిఎం దహను స్థానంలో పదోసారి విజయం సాధించడం ఒక విశేషం. ఎస్‌పి విషయంలోనూ ఇదే జరిగింది. లోక్‌సభ ఎన్నికలలో గెలుపు తర్వాత కాంగ్రెస్ చూపంతా ముఖ్యమంత్రి పీఠంపైనే వుండి కూటమి భాగస్వాములను కించపర్చింది. లోక్‌సభ ఎన్నికల్లో ముందుగా సర్దుబాట్లు పూర్తయిన రాష్ట్రం మహారాష్ట్ర కనుకనే ఫలితాలు స్పష్టంగా వచ్చాయి. కానీ ఈసారి హర్యానా తప్పులను పునరావృతం చేసింది కాంగ్రెస్. అక్కడా ఎస్‌పి, ఆప్‌లను అసలు కలుపుకోలేదు. హర్యానా ఓటమి తర్వాత ఆక్రోశం వ్యక్తం చేసింది రాహుల్ గాంధీ కాగా తాజాగా జరిగిన ఆ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆ పని చేశారు. ఏది ఏమైనా కాంగ్రెస్ సంకుచితత్వం, దూరదృష్టి లోపం వల్ల లోక్‌సభ ఎన్నికల విజయంతో వచ్చిన సదవకాశం సగం వెనక్కు పోయినట్టయింది. బలం లేకున్నా ఎక్కువ సీట్లు కావాలని పట్టుపట్టడం, తర్వాత చతికిల పడటం పరిపాటిగా మారింది. బీహార్ ఎన్నికల్లోనూ నాలుగేళ్ల కిందట వెంటపడి మరీ 70 సీట్లు తీసుకుని పోటీ చేసినా ఆ పార్టీ కేవలం 19 గెలవగలిగింది. అదే ఆర్‌జెడి, వామపక్షాల గెలుపు శాతం చాలా ఎక్కువగా వుంది. యు.పి లోనూ అంతే. ఆ రెండిటితో పాటు తమిళనాడులో కూడా 'ఇండియా' వేదిక సీట్లు పెరిగాయంటే అది ఇతర మిత్రుల విజయాల వల్ల తప్ప కాంగ్రెస్ వల్ల కాదు. ఎందుకంటే కాంగ్రెస్ యంత్రాంగం నిర్మాణ బలం విధాన స్పష్టత కూడా తగ్గిపోతున్నాయి. మహారాష్ట్రలో మాలెగావ్ వంటి చోట్ల వచ్చిన ఓట్ల శాతం చూస్తే మైనార్టీలు కూడా కాంగ్రెస్‌కు దూరంగా పోతున్నట్టు అర్థమవుతుంది. మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్, ప్రతిపక్ష నేత బాలా సాహెబ్ థోరట్ వంటి వారు కూడా గెలవలేకపోయారు. కాంగ్రెస్ 101 సీట్లలో పోటీ చేసి 16 మాత్రమే తెచ్చుకోగలిగింది. ఇందులో తొమ్మిది విదర్భలోనే. వాయువ్య భారత్‌లో మొత్తం లోక్‌సభ స్థానాలుండగా బిజెపితో ఆ పార్టీ ముఖాముఖి తలపడిన 75 సీట్లలో కేవలం తొమ్మిది మాత్రమే తెచ్చుకోగలిగింది. కనుక తన బలం గురించి అతి అంచనాలు మాని లౌకిక పార్టీలతో ఇచ్చిపుచ్చుకునే రీతిలో వ్యవహరించకపోతే కాంగ్రెస్ కోలుకోవడం కూడా కష్టమే. కార్మిక హక్కులు, రైతాంగ సంక్షోభం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టవలసిన అవసరం కూడా గ్రహించాల్సి వుంది. రైతాంగ ఆందోళనకు మార్గం చూపిన మహారాష్ట్ర ఉద్యమాల ప్రభావం ఎన్నికల ఓటింగులో ప్రతిబింబించలేదంటే కాంగ్రెస్, ఎంవిఎల వైఖరి మాత్రమే కారణం. దీనికి తోడు ఇవిఎంలు, ఓట్ల సంఖ్యలో తేడా వంటివి కూడా పరిశీలించాల్సి వుంది.జారండ్ విషయానికి వస్తే ముఖ్యమంత్రి హేమంత సోరేన్‌ను జైలుపాలు చేసి వెంటాడిన తీరును ఓటర్లు తోసిపుచ్చారు. కూటమిలో కాంగ్రెస్ 16, ఆర్‌జెడి 4, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 2 తెచ్చుకున్నాయి. ఇక బిజెపికి 21 రాగా ఆ కూటమిలోని ఎల్‌జెపి, ఎజెఎస్‌యు, జెడియు లకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయి. బిజెపి సీట్ల శాతం తగ్గిపోగా 'ఇండియా' వేదిక పార్టీల సీట్లు పెరిగాయి. ఇది కూడా అనేక ఎగ్జిట్ పోల్స్ చెప్పిన దానికి విరుద్ధం. అయితే ఇక్కడ కూడా కాంగ్రెస్ బిజెపితో నేరుగా తలపడిన 12 చోట్ల ఓటమి చవిచూసింది. ఇక ఇప్పుడు జారండ్ సర్కారు ముందు తీవ్ర ఆర్థిక సవాళ్లు వుంటాయి. కేంద్రం వివక్ష లేకుండా సహకరించాలని హిందూ పత్రిక సంపాదకీయమే రాసింది.

ఈ రెండు రాష్ట్రాల శాసనసభలతో పాటు అనేక లోక్‌సభ, శాసనసభల స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు కూడా మిశ్రమంగానే వున్నాయి. కేరళలో చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో వెనకబడిన ఎల్‌డిఎఫ్ మళ్లీ పుంజుకున్నదని ఈ ఫలితాలు నిరూపించాయి. ఇక దాని పని ముగిసినట్టేనని బిజెపి, కాంగ్రెస్ అనుకూల శక్తులు రొదపెట్టినప్పటికీ ఓటర్లు అది తప్పని చాటిచెప్పారు. చెలకరలో యుడిఎఫ్ అభ్యర్థి గెలుపు ఖాయమని మీడియా హోరెత్తినా ఎల్‌డిఎఫ్ అభ్యర్థి యుఆర్ ప్రదీప్ 12 వేల ఓట్లకు పైగా మెజారిటీతో గెలుపొందారు. మత పార్టీల సాయంతో పాలక్కాడ్‌ను కాంగ్రెస్ నిలబెట్టుకున్నా ఎల్‌డిఎఫ్ ఓట్లు గణనీయంగా పెరిగాయి. ఇక వయనాడ్‌లో ప్రియాంక గాంధీ అధిక మెజార్టీతో లోక్‌సభకు ఎన్నికైనా ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేని వ్యక్తిగత కుటుంబ వ్యవహారంగానే చూస్తున్నారు.ఇక రాజస్థాన్‌లో ఎన్నికలు జరిగిన ఏడు సీట్లలో అయిదు బిజెపి ఒకటి, కాంగ్రెస్, ఒకటి ఇతరులు, యు.పి లో మొత్తం 9లో ఏడు బిజెపి (మిత్ర పార్టీలతో సహా), రెండు ఎస్‌పి, బెంగాల్‌లో ఉప ఎన్నికలు జరిగిన మొత్తం ఆరు సీట్లు తృణమూల్, చత్తీస్‌గఢ్‌లో ఒక చోట బిజెపి, పంజాబ్‌లో మూడు చోట్ల ఆప్, కర్ణాటకలో జరిగిన మూడు చోట్ల కాంగ్రెస్, బీహార్‌లో నాలుగుకు నాలుగు బిజెపి గెలుచుకున్నాయి. అంటే ఉత్తర వాయువ్య భారతంలో బిజెపి ఆధిక్యత సాధించగా దక్షిణాదిన మాత్రం వెనకబడిపోయినట్టు మరోసారి వెల్లడైంది. వేర్వేరు పార్టీలు ఈ ఫలితాలను ఎలా విశ్లేషించుకుని భవిష్యత్ విధానాలు రూపొందించుకుంటాయో చూడవలసిందే. ఏమైనా ఒకే దేశం ఒకే ఎన్నిక పాట ఎంత పొరబాటో ఈ రకరకాల ప్రజా తీర్పులతో స్పష్టమైపోతున్నది.

# అన్ని విధాలా రాష్ట్రానికి నష్టం

సౌర విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యమున్న కంపెనీలు టెండరు ప్రక్రియలో పాల్గొంటే, అలాంటి సామర్థ్యం లేని కంపెనీలు పేర్కొన్న ధరల కన్నా తక్కువ ధరలను పేర్కొనాలి. అదేవిధంగా, వేలాది మెగావాట్ల సౌర విద్యుత్ సరఫరాకు టెండరులో పాల్గొనే కంపెనీలు అంత భారీ ఉత్పత్తి సామర్థ్యాన్ని నెలకొల్పే అవకాశంతో (ఎకానమీ ఆఫ్ స్కేల్) తక్కువ ధరలను పేర్కొనాలి. అదానీ ఎనర్జీ విషయంలో అలా జరగలేదు. ఆనాడు పోటీ బిడ్డింగులలో అలాంటి సదుపాయంలేని కంపెనీలు తక్కువ సామర్థ్యానికే అదాని రేట్లకన్నా చాలా తక్కువగా రేట్లను పేర్కొనటం వల్ల కొన్ని విషయాలు స్పష్టం అవుతున్నాయి. అదాని చివరకు అంగీకరించిన యూనిట్‌కు రూ.2.42 రేటు చాలా అధికం. సౌర విద్యుత్ ఫలకాలు, తదితర సామాగ్రిని ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న కంపెనీలు మాత్రమే బిడ్డింగులో పాల్గొనటానికి అర్హులని మోడి ప్రభుత్వం సెకీ బిడ్డింగ్ షరతులలో చేర్పించటం, నిజమైన పోటీ లేకుండా అదాని కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చటానికే. అలాంటి ఉత్పత్తి సామర్థ్యం ఉందా లేదా అనే దానితో నిమిత్తం లేకుండా, ఎవరు అతి తక్కువ రేటును బిడ్డింగులో పేర్కొంటే, ఆ కంపెనీనే ఎంపిక చేసి, సాపేక్షికంగా తక్కువ ధరలకే సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే అవకాశం ఈ షరతుల తొత్తడంతో లేకుండా పోయింది.అజూర్ కంపెనీ 4000 మె.వా. విద్యుత్ విక్రయాలతో సుమారు 20 ఏళ్ళలో పన్ను చెల్లింపు తరువాత 2 బిలియన్ డాలర్ల గణనీయమైన లాభాలు లభిస్తాయని అంచనా వేసిందని అమెరికా కోర్టులో గౌతమ్ అదానికి, ఇతరులకు వ్యతిరేకంగా దాఖలైన అభిశంసన అభియోగ పత్రంలో (పేరా 45) పేర్కొన్నారు. సాధారణంగా, సౌర విద్యుత్ ప్రాజెక్టులకు ఈక్విటీపై 16 శాతం లాభం లెక్కగట్టేవారు. ఉత్పత్తిదారులకు లాభం ఎంత గణనీయంగా ఎక్కువగా ఉంటే, సౌర విద్యుత్ కొనుగోలుదారులకు చార్జీల భారం అంత అధికంగా ఉంటుంది. అదాని-సెకితో ఎపిడి స్కాముల ఒప్పందంలో జరిగింది ఇదే.టెండర్లు వేశాక 2019 డిసెంబరు 10న సెకి అదాని గ్రీన్‌కు, అజూర్‌కు లెటర్ ఆఫ్ అవార్డ్ (ఎల్ఒఎ) ఇచ్చింది. టెండరులోని రిక్వెస్ట్ ఫర్ సెలెక్షన్ (ఆర్ఎఫ్ఎస్) నిబంధనల ప్రకారం ఎల్ఒఎ జారీ చేసిన 90 రోజులలోగా సెకి ఎంపికైన కంపెనీలతో పిపిఎలు చేసుకోవాలి. అయితే పిపిఎలు చేసుకొనేందుకు 18 నెలలకు పైగా ఆలస్యమైంది. ఎందుకంటే, వివిధ రాష్ట్రాల డిస్కాంలకు సెకీ అదాని, అజూర్‌ల నుండి కొనుగోలు చేయడానికి అంగీకరించిన రేట్లకు పిఎస్ఎలు చేసుకునేందుకు చేసిన ప్రయత్నాలను ఆ రేట్లు అధికంగా ఉన్నాయని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, డిస్కాములు అంగీకరించలేదు. ఆ తరువాత అదాని, అజూర్ కంపెనీలు వాటి అధికారుల ద్వారా 'భారీ ముడుపుల పథకం'



నడిపాక, పిపిఎలు చేసుకొనేందుకు మార్గం సుగమమైంది. మె.వా.కు రూ.25 లక్షల చొప్పున ముడుపులను లెక్కగట్టారని, ఆంధ్రప్రదేశ్ అధికారులకు రూ.1750 కోట్ల మేరకు లంచాలు ఇస్తామని హామీ ఇచ్చారని లేదా చెల్లించారని, ఆ అధికారులలో ముఖ్యమంత్రి ఉన్నారని 2021 ఆగస్టులో అదాని గ్రీన్ రికార్డులలో ఎఫ్‌బిఐ దర్యాప్తు అధికారులు కనుగొన్నారని అమెరికా కోర్టులో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) దాఖలు చేసిన అభియోగ పత్రంలో పేర్కొన్నారు. గౌతం అదాని, సాగర్ అదాని ముఖ్యమంత్రిని 2021 ఆగస్టులో, సెప్టెంబరులో వేర్వేరుగా కలిశారని, ప్రోత్సాహకాలతో సెకితో డిస్కాంలు పిఎస్ఎ చేసుకొనకపోవటాన్ని చర్చించారని అభియోగ పత్రంలో పేర్కొన్నారు (పేరాలు 29, 33, 34, 51, 53, 54). ఆ తరువాత రాష్ట్ర మంత్రి వర్గం సెకితో 7000 మె.వా. పిఎస్ఎ చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. అధిక ధరలకు ఆ సౌర విద్యుత్ కొనుగోలుకు సెకీతో ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ప్రోత్సాహకాలు పని చేశాయని అభియోగ పత్రంలో వ్యాఖ్యానించారు.అదాని సౌర విద్యుత్‌ను రాష్ట్రంలో వ్యవసాయ అవసరాలకు సరఫరా చేయడానికే కొనుగోలు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతమున్న మూడు డిస్కాములు లేదా కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామీణ వ్యవసాయ విద్యుత్ పంపిణీ కంపెనీ, ఈ విద్యుత్‌ను రాష్ట్ర మంతటా సరఫరా చేయాలి. ఆయా ప్రాంతాలలో వ్యవసాయ విద్యుత్ డిమాండు ఆధారంగా అవసరమైన ఉత్పత్తి సామర్థ్యంతో స్థానికంగా సౌర విద్యుత్ ప్రాజెక్టులను నెలకొల్పితే అనేక ప్రయోజనాలుంటాయి. వాటి నుండి చుట్టుపక్కల స్థానిక ప్రాంతాలకు విద్యుత్ ప్రసారం, పంపిణీలకు పెట్టుబడుల అవసరాలు, చార్జీలు, ప్రసార, పంపిణీ నష్టాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి ఏర్పాటు అవసరమైన ఓల్టేజి నిర్వహణకు దోహదం చేస్తుంది. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. రాజస్థాన్‌లోని అదాని ప్రాజెక్టుల నుండి సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసే ఏర్పాటుతో రాష్ట్రం, వినియోగదారులు ఈ ప్రయోజనాలను కోల్పోయారు. అంతకు ముందు, రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా 6000 మె.వా సౌర విద్యుత్ కొనుగోలుకు టెండర్లు పిలిచింది ఇలాంటి ఏర్పాట్ల అవకాశాలతోనే. టెండర్ల షరతుల మార్పుపై వివాదాలతో, హైకోర్టు తీర్పుతో, తరువాత సెకీతో ఏర్పాటుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం చివరకు ఆ టెండర్లను రద్దు చేసుకుంది. కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పిజిసిఐఎల్ రాజస్థాన్ నుండి అదాని విద్యుత్‌ను రాష్ట్ర సరిహద్దు వరకు ప్రసారం చేస్తుంది. అక్కడి నుండి ఆ విద్యుత్‌ను వ్యవసాయం నిమిత్తం రాష్ట్రమంతటా సరఫరా చేయాల్సినందున ప్రసార, పంపిణీ నష్టాలు ఎక్కువ అవుతాయి. రాజస్థాన్ నుండి సౌర విద్యుత్ పొందటం వల్ల రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు భూమి కేటాయించాల్సిన అవసరం ఉండదని, దానిని ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చునని ఆనాడు అదాని-సెకితో ఒప్పందం వ్యవహారంలో ఉన్న అధికారులు వాదించారు. ప్రతి రాష్ట్రం అదే వైఖరి తీసుకుంటే, విద్యుత్ ప్రాజెక్టులు, ఆ మాటకు వస్తే ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమల వంటి వాటి స్థాపనకు, ఉపాధి కల్పనకు, అభివృద్ధికి అవకాశాలు వుండవనేది స్పష్టం. ఇతర రాష్ట్రాల నుండి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తుందనేది స్పష్టం.